నీడ లేని నిరీక్షణ

- కానిరాని బస్ షెల్టర్లు
- ఉన్న చోట వసతులు కరువు
- ఎండకు, వానకూ ప్రయాణికుల అవస్థలు



గోనెగండ్లలో రోడ్డుపైనే బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

గోనెగండ్ల : గోనెగండ్ల మండలంలోని ఆయా గ్రామాల్లో బస్టాపుల పేర్లు వినిపిస్తున్నాయి. అయితే చాలా చోట్ల బస్ షెల్టర్లు లేవు. ఉన్నా అందులో సౌకర్యాలు లేక ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపై నిలబడి నిరీక్షించాల్సిందే. ఎండాకాలంలో ఎండలో నిలబడాల్సి వస్తోంది. వానాకాలంలో అయితే వర్షం వస్తే చెట్ల కిందికో, షాపు వద్దకో పరుగుతీయాల్సిన దుస్థితి. అయినా పట్టించుకునేవారే లేకపోవడం శోచనీయం.

రోజూ వేల సంఖ్యలో ప్రయాణికులు

గోనెగండ్ల మండలంలో జనాభా దాదాపు 80 వేల కంటే ఎక్కువగా ఉంది. పలు విద్యా సంస్థలకు నెలవైన గోనెగండ్లలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. అలాగే మండలం నుంచి ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు పట్టణాలకు వ్యాపారపరంగా, ఉద్యోగులు, విద్యార్థులు ప్రతి రోజు బస్సుల ప్రతి రోజు వేల సంఖ్యలో ప్రాయాణాలు సాగిస్తుంటారు.

నిరుపయోగంగా..

మండలంలోని చాలా గ్రామాల్లో బస్ షెల్టర్లు లేవు. గోనెగండ్ల, హెచ్. కైరవాడి, వేముగోడు తదితర గ్రామాల్లో బస్ షెల్టర్లు ఉన్నా నిరుపయోగంగా ఉన్నాయి. అందులో కనీస సౌకర్యాలు లేవు. కుర్చునేందుకు కూడా కుర్చీలు, బెంచీలు లేవు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చేందుకు బస్సు కోసం కనీసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో బస్సుల కోసం వేచి ఉండేందుకు బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిలబడేందుకు నీడ లేక, కూర్చోవడానికి చోటు లేక ఇబ్బందులు పడుతున్నారు. చంటి బిడ్డల తల్లులు, ముసలి ముతక వారి పరిస్థితి చెప్పనలివికాదు. ఎండకు ఎండాల్సిందే, వర్షం వస్తే అటూ ఇటూ పరుగెత్తాల్సిందే. ఇంతగా అవస్థలు పడుతున్న ప్రయాణికుల గురించి ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన ప్రతి చోట బస్ షెల్టర్లు ఏర్పాటు చేసి అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



మండల కేంద్రం గోనెగండ్లలో ఉన్న బస్సు బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడం దారుణం. బస్సుల కోసం అనునిత్యం ప్రయాణికులు గంటల తరబడి ఎండలో నిరీక్షించాల్సి రావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇకనైనా అధికారులు స్పందించి అవసరమైన చోట బస్ షెల్టర్లు ఏర్పాటు చేసి కనీస సౌకర్యాలు కల్పించాలి. – హాజి మలంగ్, గోనెగండ్ల

వాన వస్తే తడుస్తున్నాం



ప్రతి రోజూ ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలుకు తిరిగే ప్రయాణికులు బస్ షెల్టర్లు లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నారు. అంగళ్ల ముందు బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. బస్ షెల్టర్లు ఏర్పాటు చేసి, అందులో సౌకర్యాలు కల్పించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

– తాయప్ప, గోనెగండ్ల

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి పూజలు



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

బకాయిలు వంద శాతం వసూలు చేయాలి



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఉమాపతి

ఆదోని అర్బన్: పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులను వంద శాతం వసూలు చేయాలని, లోఓల్టేజి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఉమాపతి ఆదేశించారు. శనివారం పట్టణంలోని విద్యుత్‌శాఖ ఈఈ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఎస్‌ఈ మాట్లాడుతూ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వేసవి కాలంలో ఓల్టేజీ సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విద్యుత్‌శాఖ అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఏఓ రాఘవులు, ఆదోని ఈఈ హరి, ఏడీఈ పురుషోత్తం, డీఈ నాగభూషణం, డివిజన్‌లోని ఏఈలు పాల్గొన్నారు.

నేడు నిరసన కార్యక్రమం

ఆదోని రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడంపై నిరసన తెలియజేస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న తెలిపారు. ఈ మేరకు శనివారం వారు స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈనెల 19న ఆదోనిలోని మున్సిపల్ గ్రౌండ్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు. దేశానికి సేవలందించిన అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి పదవిలో ఉన్న అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జాలవాడిలో చోరీ

పెద్దకడబూరు : మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు జాలవాడి గ్రామానికి చెందిన గొల్ల భీమేష్ మంత్రాలయం మండలం కాచాపురం గ్రామానికి పండుగకు వెళ్లిన భార్యను తీసుకొని రావడానికి ఈనెల 16న వెళ్లాడు. ఇదే అదునుగా చుసుకొని గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళాన్ని పగలగొట్టి బీరువాలో ఉన్న అర తులం బంగారు కమ్మలు, రెండు బంగారు ఉంగరాలు, 50తులాల వెండి కడియాలు దొంగలించుకొని పోయినట్లు తెలిపారు. 17వ తేదీన కుటుంసభ్యులతో వచ్చి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

7నుంచి అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు

హొళగుంద: వచ్చే నెల 7 నుంచి మొదలయ్యే సిద్దేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా 7, 8 తేదీల్లో మండల కేంద్రంలో అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తిక్కస్వామి, పవన్, అశోక్, దేవరాజ్, మల్లికార్జున శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు వరుసగా..రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 7న రూ.వెయ్యి ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 8309534550, 7899966226 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఏప్రిల్ 14న సామూహిక వివాహాలు

హొళగుంద: మండల కేంద్రంలో ఏప్రిల్ 14వ తేదీన అంబేడ్కర్ జయంతి సందర్భంగా సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు కన్నారావు, పంచగుండిగ వెంకటేష్ తెలిపారు. శనివారం వారు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పంపాపతి, శేఖర్‌తో కలిసి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

బకాయిలు విడుదల చేయాలి

ఆదోని సెంట్రల్: పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షన్, గ్రాట్యూటీ వంటి బకాయిలను విడుదల చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.రామశేషయ్య డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పట్టణంలో సుదీర్ఘకాలం ఉపాధ్యాయులుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు సర్వోజిరావు, విజయలక్ష్మీబాయి పేద విద్యార్థులకు సేవ చేయడం అభినందనీయమన్నారు. వారి చేతుల మీదుగా డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. బీటీఏ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యాయులు నాగపరిమళబాయి, ప్రవీణ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను తనిఖీ

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలోని నిర్మల్ థియేటర్ దగ్గర ఉన్న అన్న క్యాంటీన్‌ను శనివారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తనిఖీ చేశారు. క్యాంటీన్‌లోని భోజనాన్ని రుచి చూశారు. అక్కడ భోజనం చేస్తున్న ప్రజలని భోజనం రుచిపై అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు రూ.5కే రుచికరమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుందన్నారు. అన్నా క్యాంటీన్ నిర్వాహకులు నాణ్యత తగ్గకుండా రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

బాలికల చదువుతోనే దురాచారాలు దూరం



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు రుఖీయా బేగం

గోనెగండ్ల : బాలికల చదువుతోనే సమాజంలో ఉన్న దురాచారాలు, బాల్య వివాహాలు దూరమవుతాయని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుఖీయా బేగం, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్ట్ అధికారి శారద, సీఐ గంగాధర్ అన్నారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో సీడీపీఓ సఫరున్నిసా బేగం ఆధ్వర్యంలో ఏఎన్‌ఎం, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ వర్కర్స్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు కిశోరా బాలికల వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా ప్రజలలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు బతుకుదెరువు కోసం వలసలు వెలుతున్నప్పుడు వారి వెంట బాలికలను తీసుకోవడం వలన అక్కడ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వారి చదువు కూడా నిలిచిపోతుందన్నారు. బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వలసలు వెళ్లే కుటుంబాలు పిల్లలను కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా లీగల్ కమ్ ప్రొహిబిషన్ అధికారి శ్రీలక్ష్మి, ఎంపీడీఓ మణి మంజరి, ఈఓఆర్డీ అనంతసేన, ఏపీఎం హేమలత, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు భాగ్యలక్ష్మి, జరీనా బేగం, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఆలయ నిర్మాణానికి శ్రీకారం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని రంగప్ప గట్టు సమీపంలో వెలసిన పెండేకంటి ఆంజనేయ స్వామి నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పురాతన కాలంలో నిర్మించి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. శనివారం పెండేకంటి కులబాంధవులు, గ్రామస్తుల సహకారంతో నూతన ఆలయ నిర్మాణానికి ఎంపీపీ ఈరన్న భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ముందుగా ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు చేపట్టారు. నిర్మాణం కోసం కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సమీపంలో చిక్ బాలపూర్ నుంచి భారీ స్థాయి పునాది, స్తంభాలను రాళ్లను తీసుకొచ్చారు. భక్తులు కలశాలు, మేళతాళాలతో మార్కండేయ స్వామి ఆలయం నుంచి ర్యాలీగా వచ్చి స్వామికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పెండేకంటి కులస్తులు ఉసేని, రాముడు, ఆంజనేయ, నాగరాజు, హనుమంతు, భీమయ్య, తిక్కయ్య, లోకారెడ్డి పాల్గొన్నారు.

వలస వెళ్లొద్దు



దుద్ది గ్రామంలో మాట్లాడుతున్న డీఈఓ శ్యాముల్ పాల్

కోసిగి: గ్రామాలు వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి పిల్లల జీవితాలు నాశనం చేయవద్దని గ్రామ స్పెషల్ ఆఫీసర్, డీఈఓ శ్యాముల్ పాల్ సూచించారు. శనివారం మండలంలోని దుద్ది, కొల్మాన్‌పేట, సాతనూరు గ్రామాలను ఎంపీడీఓ వెంకటేశ్వర్లులతో కలసి ఆయన పర్యటించి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను చేసుకుని పిల్లలను చదివించుకుంటూ సంతోషంగా జీవించాలని సూచించారు. తాత్కాలికంగా మీ సంపాదన కోసం పిల్లలను బడి మానిపించి తమ వెంట తీసుకెళ్లి, వారి జీవితాలు నాశనం చేయకూడదన్నారు. సొంత గ్రామంలో ఉన్న కాటికి పనులు చేసుకుని పిల్లలకు బంగారు భవిషత్‌ను అందించాలన్నారు. చదువుతోనే పిల్లల జీవితాలు మెరుగుపడుతాయని చెప్పారు. ఎంఈఓ–2 శోభరాణి, ఏపీఓ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ గిడ్డయ్య, విజయరాజు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ టోర్నమెంట్



విజేత జట్టుకు ట్రోఫీని బహూకరిస్తున్న సీఐ శ్రీరామ్

ఆదోని సెంట్రల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బాలాజీ సీనియర్ క్రీడాకారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. పట్టణంలోని దుబ్బ గణపతి సమీపంలో జరిగిన పోటీలలో ప్రశాంతి నగర్, దండగేరి, వాల్మీకీ నగర్, అరుణ జ్యోతి నగర్ నుంచి యువకులు పెద్ద ఎత్తున ఈ పోటీల్లో పాల్గొన్నారు. శనివారం జరిగిన పోటీలను మల్లికవ్వ, నాగేంద్రప్ప ప్రధానోపాధ్యాయులు ప్రారంభించారు. విజేత జట్లకు వన్ టౌన్ సీఐ.శ్రీరామ్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. మొదటి బహుమతి బావాజీ టీంకు రూ.20,000 నగదుతో పాటు ట్రోఫీని బహూకరించారు. రెండవ బహుమతి ఎస్‌జేవీ టీం రూ. 15,000 నగదు, ట్రోఫీ అందుకుంది. మూడు, నాలుగు బహుమతులుగా రూ. 10,000, రూ. 5000లు నగదు ప్రోత్సాహంతో పాటు ట్రోఫీని బహూకరించారు. బెస్ట్ రైడర్‌గా దిలీప్‌టీం, బెస్ట్ డిఫెండ్ బండారి, గణేష్ బాబాజీటీం, బెస్ట్ ఆల్‌రౌండర్ ఈరన్న బాబాజీటీం, బెస్ట్ క్యాచర్‌గా ఈరన్న ఎస్‌జేవీ టీంలకు బహుమతులను అందించారు. టోర్నమెంట్ నిర్వాహకులు రవి, రామన్న, జయరాం, అమర్ ప్రకాశ్, కమిటీ సభ్యులు నాగేంద్ర, నాగేష్, ఆశోక్, కౌన్సిలర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

జేసీబీ తొక్కి చిన్నారికి గాయాలు



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి నీరజ్

ఆదోని అర్బన్: పట్టణశివారులోని జగనన్న కాలనీలో నిద్రిస్తున్న నీరజ్ అనే తొమ్మిది నెలల చిన్నారిపై శనివారం జేసీబీ ఎక్కడంతో కాలుకు తీవ్ర గాయమయ్యింది. వెంటనే స్థానికులు బాలుడి తల్లిదండ్రులు ఆదోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. బాలుడి తల్లిదండ్రులు హరిశంకర్, రామ్‌రతీ పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు.. మధ్యప్రదేశ్ రాష్ట్రం, చిత్తర్‌పూర్ జిల్లా, కరిని గ్రామానికి చెందిన హరిశంకర్ దంపతులు వలస వచ్చి ఆదోనిలో జగనన్న కాలనీలో నిర్మాణ పనులు చేసుకుంటున్నారు. తొమ్మిది నెలల నీరజ్‌ను పక్కనే పడుకోబెట్టి పనులు చేస్తుండగా ప్రమాద వశాత్తు జేసీబీ అతని కాలుపై ఎక్కింది. గాయాలపాలైన తమ కుమారుడిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



చెత్తాచెదారాన్ని ఊడ్చి డస్ట్‌బిన్‌లోకి వేస్తున్న ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్, అధికారులు

ఆదోని రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఆదోని డివిజన్ ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలో చెత్తాచెదారాన్ని శుభ్రం చేసే కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమం ద్వారా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. అలాగే ప్రజలు ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై పారవేయకుండా మున్సిపల్ చెత్త బండ్లలో వేసి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

మండలంలోని గోనబావి గ్రామ సచివాలయాన్ని శనివారం ఆదోని ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్ తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను, సచివాలయ ఉద్యోగుల హాజరును తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

కౌతాళం: స్వచ్ఛ దివాస్ కార్యక్రమం ద్వారా గ్రామాలను చెత్తరహితంగా తీర్చిదిద్దవచ్చని ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని మండల కేంద్రమైన కౌతాళంలో సర్పంచ్ పాల్‌దినకర్ అధ్యక్షతన నిర్వహించారు. సర్పంచ్‌తో పాటు అధికారులు నాయకులు గ్రామంలోని ప్రధాన రోడ్లను చీపురు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ యోగేశ్వర్‌రెడ్డి, తుంగభద్ర బోర్డు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ టిప్పుసుల్తాన్, ఉరుకుంద ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ చెన్నబసప్ప, డైరెక్టర్ కొట్రేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌కు సహకరిద్దాం

పెద్దకడబూరు : స్వర్ణాంధ్ర, స్వచ్ఛభారత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జయరాముడు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేపట్టారు. అనంతరం వీధులను శుభ్రపరిచారు.

స్వచ్ఛ దివస్‌పై అవగాహన

కోసిగి : మండల కేంద్రంలో ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, పంచయతీ సిబ్బంది స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్ సమీపంలో శుభ్రం చేసి ప్రతిజ్ఞ చేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుదాం

నందవరం : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతయని ఆదోని డీఎల్‌పీఓ నూర్జహాన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీ, ఎంపీడీఓ పుల్లయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ చేపట్టి పరిశుభ్రతపై గ్రామస్తులు, దుకాణదారులకు అవగాహన కల్పించారు.

- మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శ్రీలేఖ ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బందితో సీహెచ్‌ఓ బలరాముడు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్వచ్ఛతపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివాస్ కార్యక్రమంపై డీఎల్‌పీఓ నూర్జహాన్, ఎంపీడీఓ మణి మంజరి ఆయా శాఖల అధికారులచే కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేన, సర్పంచ్ హైమవతి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్‌లో భాగంగా పెద్దపార్కులో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ సుధ, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బాలజీకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలి

ఆదోని సెంట్రల్: అంబేడ్కర్ స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని అరసం జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్ అన్నారు. ఇటీవల గౌరవ డాక్టరేట్ అందుకున్న సుమాల దుర్గన్నను శనివారం పట్టణంలో అరుణోదయ పాఠశాలలో ఆయనను మిత్రులు, బంధువులు ఘనంగా సన్మానించారు. గ్రామీణ నేపథ్యంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని విద్యాభ్యాసం చేసి అధ్యాపకుడిగా వృత్తిని ప్రారంభించి ప్రిన్సిపాల్ స్థాయికి ఎదిగారన్నారు. సామాజిక సేవకుడుగా, నిరుపేద విద్యార్థులకు చేయుతనందిస్తూ నేటి తరానికి స్ఫూర్తిగా నిలిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మిత్రులు నాగన్న, దేవసహాయం, వెంకటేశ్వర్లు, బోజ, దశరథరాముడు, రామలింగ, మోహన్ పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఆదోని టౌన్: 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ బీసీ నిరుద్యోగులు బీసీ కార్పొరేషన్ కింద రుణాలు పొందేందుకు వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. శనివారం ఆయన మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో వార్డు సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీలతో సమావేశమయ్యారు. రుణాల మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించాలని వెల్ఫేర్ అసిస్టెంట్లకు సూచించారు. బీసీలు, కాపు, బలిజ(ఈబీసీ) వర్గాలకు చెందిన బీసీ నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

21 నుంచి ఆధార్ క్యాంపులు

నందవరం: ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. 0 నుంచి 5 ఏళ్ల చిన్నారులకు ప్రత్యేకంగా ఈ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21న పూలచింత, కనకవీడు, కే.పేట, నాగలదిన్నె, గురజాల గ్రామాలలోని సచివాలయాలలో ఆధార్ సేవలు నిర్వహిస్తునట్లు తెలిపారు. 22, 23, 24వ తేదీల్లో మాచాపురం, నందవరం, ఇబ్రహీంపురం, కనకవీడు, సోమలగూడూరు, పెద్దకొత్తిలి, నాగలదిన్నె, నదికైరవాడి గ్రామాల్లో ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు. క్యాంపులను విద్యార్థులు, చిన్నారుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు.

20న పెన్షనర్ల రాష్ట్ర మహాసభ

ఎమ్మిగనూరురూరల్: ఈ నెల 20వ తేదిన పట్టణంలో జరిగే ఏ.పీ. ప్రభుత్వ పెన్షనర్ల రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షుడు ఏపీ.వీరన్న పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం సంఘ సెక్రటరీ జి. శ్రీనివాసులు, గౌరవ సలహాదారులు అబ్దుల్‌కరీంలతో కలసి కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఉప్పర కల్యాణ మండపంలో రాష్ట్ర మహాసభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులు, తాలూకా అధ్యక్షులు, ఇతర కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నట్లు తెలిపారు. మొట్టమొదటి సారిగా పెన్షనర్ల సంఘం రాష్ట్ర మహాసభను ఎమ్మిగనూరులో నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. మహాసభకు హజరయ్యే ప్రతి పెన్షనర్‌కు భోజనం, వసతి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ట్రెజరర్ పోలకం తయ్య, శర్మ, ఇతర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వలసలు నివారించడంలో ప్రభుత్వం విఫలం



నరసింహయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

గోనెగండ్ల: వలసలు నివారించడంలో కూటమి ప్రభుత్వ విఫలమయ్యిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండి ఆనంద్ బాబు, మండల కార్యదర్శి కరుణాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలోని బస్టాండ్‌లో సీపీఎం మండల నాయకుడు నబి రసూల్ అధ్యక్షతన టి. నరసింహయ్య 6వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కార్మిక కర్షక వ్యవసాయ కూలీలకు అండగా సంఘాలను నిర్మించి, దోపిడి రహిత సమాజం కోసం తన జీవిత చివరమాంకం వరకు ఎర్రజెండా భుజానేసుకుని ఉద్యమించిన విప్లవకారుడు నరసింహయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మునెప్ప, బతకన్న, స్వామి, రామకృష్ణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బసరకోడులో తాగునీటి ఎద్దడి



నీటి కోసం ట్యాంకు వద్ద వరుసలో పెట్టిన బిందెలు

ఆదోని రూరల్: మండలంలోని బసరకోడు గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులు స్పందించి వెంటనే పరిష్కరించాలని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఉచ్చీరప్ప, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హుసేని, కేవీపీఎస్ నాయకులు రామంజి డిమాండ్ చేశారు. శనివారం వారు గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి నీటి ఎద్దడి వివరాలను తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో నెలలో ఒక్కసారి లేదా రెండు సార్లు మాత్రమే కుళాయిలకు మంచినీరు సరఫరా చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేసవికాలంలో సమస్య మరింత జఠిలంగా మారే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.